# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 07-09-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

❖ వరదల కారణంగా తలెత్తే ఆరోగ్య సమస్యలపై దృష్టి పెట్టామని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు.

❖ ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా బుడమేరుకు పడిన 3 గండ్లను విజయవంతంగా పూడ్చివేశామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.

❖ వినాయక చవితి సందర్భంగా ఈరోజు రాష్ట్రంలోని ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.

❖ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ఈనెల 9వ తేదీన వాయుగుండంగా మారే అవకాశం ఉందని భారత వాతావరణ కేంద్రం పేర్కొంది.

=========================

వరద ప్రభావిత ప్రాంతాల్లో చేపడుతున్న పారిశుద్ధ్య పనులపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు విజయవాడ కలక్టర్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో మంత్రి సత్యకుమార్ యాదవ్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సమీక్ష అనంతరం మంత్రి సత్యకుమార్ యాదవ్ పాత్రికేయులతో మాట్లాడుతూ... 35 సచివాలయాల్లో పారిశుద్య పనులు కొనసాగుతున్నాయని అన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో 124 మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశామని అన్నారు. వరదల కారణంగా తలెత్తే ఆరోగ్య సమస్యలపై దృష్టి పెట్టామని, మూడు రోజుల పాటు వరద ప్రభావిత ప్రాంతాల్లో ఇంటింటి సర్వే నిర్వహిస్తామని వెల్లడించారు. వ్యాధులు ప్రబలే అవకాశం ఉండటంతో ఇప్పటికే లక్ష మెడికల్ కిట్లు పంపిణీ చేశామని తెలిపారు. దోమ తెరలు కూడా సరఫరా చేస్తున్నామని, కలుషిత నీటితో వ్యాధులు రాకుండా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి వివరిస్తూ...

(వాయిస్ 35 సెకన్లు)

=========================

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ఈనెల 9వ తేదీన వాయుగుండంగా మారే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం పేర్కొంది. నిన్న మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ఈరోజు తీవ్ర అల్పపీడనంగా బలపడింది. ఇది ఉత్తర దిశగా కదులుతూ.. ఒడిశా, పశ్చిమ బెంగాల్, బంగ్లాదేశ్ తీరాల్లో సోమవారం నాటికి వాయుగుండంగా మారనుంది. ఆ తర్వాత మూడు రోజుల్లో పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ ఉత్తర ఒడిశా, ఝార్ఖండ్, ఉత్తర ఛత్తీస్ గఢ్ మీదుగా ప్రయాణించే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రానున్న రెండు రోజులపాటు కోస్తా జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. అలాగే రాయలసీమలో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని పేర్కొంది. రేపు ఏలూరు, అల్లూరి సీతారామరాజు, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఎన్టీఆర్ జిల్లాల్లో అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని, డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ కోనసీమ, కాకినాడ, అనకాపల్లి, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, కృష్ణా జిల్లాల్లో కొన్ని చోట్ల భారీ నుంచి అతిభారీ వర్షాలు.. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం అధికారి వెల్లడించారు.

========================

వినాయక చవితి సందర్భంగా ఈరోజు రాష్ట్రంలోని ప్రజలు ఇళ్ళల్లోనూ, గణనాథుని మండపాలలోనూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఊరూవాడా సర్వాంగ సుందరంగా అలంకరించిన వినాయకుని మండపాలలో వివిధ రకాల గణపయ్యలు భక్తులకు దర్శనమిస్తున్నారు. చిన్నా, పెద్ద వయస్సుతో సంబంధం లేకుండా ప్రతీ ఒక్కరూ ఆనందోత్సాహాలతో జరుపుకునే గణేశుని ఉత్సవాలకు ఈరోజు శ్రీకారం చుట్టారు. మరోవైపు కాణిపాకం దేవాలయంలో వినాయకస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగవైభవంగా ప్రారంభమయ్యాయి. ఈరోజు ఉదయం పాలాభిషేకంతో బ్రహ్మోత్సవాలు మొదలయ్యాయి. ఈరోజు నుంచి ఈనెల 21 వరకు బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ అధికారులు తెలిపారు.

========================

తుంగభద్ర జలాశయానికి వరద ప్రవాహం స్థిరంగా కొనసాగుతుంది.. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండటంతో జలాశయానికి 34 వేల 421 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరిందని అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం జలాశయంలో 1,632 అడుగులకు గాను 101.77 టీఎంసీల నీటి నిల్వ ఉందని…. జలాశయం నుంచి వివిధ కాల్వలకు, 13 గేట్లు ఎత్తి 34 వేల 181 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారని అధికారులు తెలిపారు.

విరామం

========================

గత వారం రోజులుగా కురిసిన భారీ వర్షాల కారణంగా బుడమేరుకు పడిన 3 గండ్లను విజయవంతంగా పూడ్చివేశామని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. రెండవ దశలో వర్షాలు పడి ఆకస్మిక వరద వచ్చినా తట్టుకునేలా బుడమేరు గట్లు ఎత్తు పెంచే పనులు చేపట్టామని ఈరోజు పాత్రికేయులకు మంత్రి వివరించారు. తాజా వాతావరణ సమాచారం మేరకు బుడమేరు పరివాహక ప్రాంతంలో మళ్లీ వర్షాలు పడి 8 వేల క్యూసెక్కుల వరదనీరు వచ్చే అవకాశం ఉందని మంత్రి వెల్లడించారు. గండ్లు పూడ్చివేతతో విజయవాడ దిగువ ప్రాంతాలకు బుడమేరు వరద నీరు ఆగిపోయిందన్నారు. జక్కంపూడి, సింగ్ నగర్, నిడమానూరు వరకు నిలిచిపోయిన నీటిని కొల్లేరుకు పంపేలా చర్యలు చేపట్టామని మంత్రి నిమ్మల రామానాయుడు తెలియజేస్తూ…

(వాయిస్ 25 సెకన్లు)

========================

విజయవాడ నగరంలో ఈరోజు మరోసారి భారీ వర్షం కురిసింది. దీంతో సహాయ కార్యక్రమాలకు అంతరాయం ఏర్పడింది. ఇప్పటికే ముంపు ప్రాంతాల్లో బురదను తొలగించే పనులు కొనసాగుతున్నాయి. ప్రభుత్వం బాధిత కుటుంబాలకు నిత్యావసర సరకులను అందజేస్తోంది. బుడమేరు గండ్లను జలవనరుల శాఖ అధికారులు దాదాపు పూడ్చివేశారు. దీంతో దిగువ ప్రాంతాలకు వరద ప్రవాహం తగ్గుముఖం పడుతోంది. ఇదిలా ఉండగా నగరంలోని ప్రకాశం బ్యారేజ్ వద్ద గేట్ల మరమ్మతుల పనులను ఇంజినీర్లు, సిబ్బంది పూర్తి చేశారు. 67, 69వ గేట్ల వద్ద దెబ్బతిన్న కౌంటర్ వెయిట్‌లను విజయవంతంగా అమర్చారు. నిపుణులు కన్నయ్య నాయుడు పర్యవేక్షణలో ఈ మరమ్మతు పనులు చేపట్టారు. మరమ్మత్తులు పూర్తి కావడంతో అడ్డుగా ఉన్న పడవల తొలగింపుపై అధికారులు దృష్టి సారించారు.

========================

విజయవాడ నగరంలో ఈరోజు కురిసిన భారీ వర్షం కారణంగా సహాయక చర్యలకు అంతరాయం కలుగుతోంది. ఈ నేపథ్యంలో ఎన్టీఆర్ జిల్లా అధికారులతో కలెక్టర్ జి.సృజన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. జక్కంపూడి కాలనీ, అంబాపురం వెళ్లే మార్గం ఇంకా జలదిగ్బంధంలోనే ఉన్నాయని, వర్షాలపై అధికారులు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భారీ వర్షాల వల్ల లోతట్టు ప్రాంతాల్లోకి మళ్లీ వరదనీరు చేరే అవకాశముందని.. పల్లపు ప్రాంతాల్లోని ప్రజలను సాయంత్రం లోగా పునరావాస శిబిరాలకు తరలించాలని సూచించారు. ఈ శిబిరాల్లో ఆహారం, ఇతర సౌకర్యాలు కల్పించాలని అధికారులకు కలెక్టర్ స్పష్టం చేశారు.

========================

విశాఖపట్నం నుంచి 4 నూతన విమాన సర్వీసులను ఇండిగో ఎయిర్‌లైన్స్ ప్రారంభించనుంది. ఈనెల 21వ తేదీన ఉదయం 9 గంటలకు విశాఖ - హైదరాబాద్ సర్వీసు ప్రారంభం కానుంది. ఆ తర్వాత అక్టోబర్ 27వ తేదీన విశాఖ - విజయవాడ సర్వీసును ప్రారంభించనున్నారు. ప్రతిరోజూ ఉదయం 9 గంటల 15 నిమిషాలకు విశాఖపట్నం నుంచి విమానం బయలుదేరనుంది. అదే రోజున విశాఖ - హైదరాబాద్ సర్వీసును కూడా ప్రారంభించనున్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు ఈ విమానం విశాఖ నుంచి బయలుదేరుతుంది. మరోవైపు విశాఖ - అహ్మదాబాద్‌కు వారానికి మూడు రోజుల కొత్త సర్వీసును ప్రారంభించనున్నామని ఆంధ్రప్రదేశ్ ఎయిర్ ట్రావెలర్స్ అసోసియేషన్ ప్రతినిధులు వెల్లడించారు.

========================

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును ఉపముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ ఈరోజు విజయవాడ కలెక్టరేట్ లో కలిసి ముఖ్యమంత్రి సహాయనిధికి కోటి రూపాయల చెక్కును అందజేశారు. వరద బాధితుల సహాయార్థం ఉప ముఖ్యమంత్రి ఇటీవల విరాళం ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్‌లోని వరద ప్రభావంతో దెబ్బతిన్న ప్రతీ పంచాయతీకీ లక్ష రూపాయల చొప్పున మొత్తం 400 పంచాయతీలకు 4 కోట్ల రూపాయల సొంత నిధులను విరాళంగా ఇస్తానని వెల్లడించారు. ఆ నగదును నేరుగా ఆయా పంచాయతీల బ్యాంకు ఖాతాలకు జమ చేస్తానన్నారు. ఆదే విదంగా తెలంగాణ ముఖ్యమంత్రి సహాయనిధికి కూడా కోటి రూపాయల విరాళం ప్రకటించారు.

========================

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా అనకాపల్లి జిల్లా రావికమతం మండలంలోని కల్యాణపులోవ, కోనాం జలాశయాలకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. కల్యాణపులోవ గరిష్ఠ నీటి మట్టం 460 అడుగులు కాగా నిన్న సాయంత్రానికి 459.10 అడుగులకు చేరిందని జల వనరులశాఖ అధికారులు తెలిపారు. ఎగువ నుంచి 100 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండటంతో నిన్న సాయంత్రం నుంచి అత్యవసరంగా రెండు స్పిల్‌వే గేట్లను ఎత్తి 100 క్యూసెక్కులు దిగువ సర్పా నదికిలోకి విడిచిపెడుతున్నామని వెల్లడించారు.

========================
========================